క్లుప్తంగా

సాయిబాబాకు ప్రత్యేక పూజలు

నందిగామ: పట్టణంలోని రామలింగేశ్వరనగర్‌లోగల సాయిబాబా ఆలయంలో కార్తీకమాసం గురువారం నేపథ్యంలో ప్రత్యేక పూజలు జరిగాయి. వేకువజామునే ఆలయ అర్చకులు బాబాకు పంచామృత అభిషేకాలు చేశారు. సాయంత్రం సమయంలో పాదుకులసేవ నిర్వహించారు. పట్టణంలోని చెరువుబజార్, అశోక్‌నగర్‌లోగల బాబా ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు.రామిరెడ్డిపల్లి సాయి బాబా మందిరంలో సామూహిక పూజలు చేశారు.

రూ.25వేల ఆర్థిక సాయం

నందిగామ: పాడి పరిశ్రమనే నమ్ముకున్న వారికి పాల ఉత్పత్తిదారుల పరస్పర సహాయక సహకార సంఘం అండగా నిలుస్తుండటం అభినందనీయమని కేడీసీసీ బ్యాంక్ డైరెక్టర్ కొమ్మినేని రవిశంకర్ పేర్కొన్నారు. మండలంలోని మాగల్లు గ్రామానికి చెందిన షేక్ హుస్సేన్ అనే పాడి రైతు గతనెలలో మృతి చెందాడు. ఈ నేపథ్యంలో కృష్ణా మిల్క్ యూనియన్, కృష్ణాజిల్లా సహకార బ్యాంక్ ఆధ్వర్యంలో మృతుడి కుటుంబానికి గురువారం రూ.25వేలను ఆర్థికసాయంగా అందించారు. ఈ నగదును మృతుడి కుటుంబ సభ్యులకు రవిశంకర్ అందజేశారు.

గరికపాడు చెక్‌పోస్టు పరిశీలన



గరికపాడు(జగ్గయ్యపేట): మండలంలోని గరికపాడు వద్దగల రాష్ట్ర సరిహద్దు చెక్‌పోస్టును విజయవాడ డీసీపీ అజిత వేజెండ్ల గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చెక్‌పోస్ట్ వద్ద వాహనాల తనిఖీని పోలీసులు ముమ్మరం చేయాలన్నారు. ముఖ్యంగా తెలంగాణ రాష్ట్రంలో ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. అంతే కాకుండా జాతీయ రహదారులపై ప్రమాదాలు నివారణకు పలుచోట్ల ప్రమాద హెచ్చరిక బోర్డులు కూడా ఏర్పాటు చేయాలని సూచించారు. కార్యక్రమంలో నందిగామ ఏసీపీ జనార్దన్‌నాయుడు, సీఐ జానకిరామ్, చిల్లకల్లు ఎస్‌ఐ కృష్ణబాబు పాల్గొన్నారు.

380 బోరాల పత్తి కొనుగోలు


కంచికచర్ల : కంచికచర్ల వ్యవసాయ మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసిన పత్తి కొనుగోలు కేంద్రంలో గురువారం రైతులు తీసుకవచ్చిన పత్తిని కొనుగోలు చేసినట్లు వ్యవసాయ, మార్కెటింగ్‌శాఖ జాయింట్ డైరెక్టర్ కె.శ్రీనివాసరావు తెలిపారు. రైతులు తీసుకువచ్చిన పత్తిని ముందుగా జాయింట్ డైరెక్టర్ పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏఎంసీ పరిధిలో రైతులు 380 పత్తి బోరాలు తీసుకురాగా మొత్తాన్ని కొనుగోలు చేసినట్లు చెప్పారు. 270 పత్తి బోరాలను ప్రభుత్వం ప్రకటించిన అత్యధిక ధర క్వింటాకి రూ.7,020లకు కొనుగోలు చేశామని, 110పత్తి బోరాలను కనిష్ట ధర రూ.6,664, సగటున రూ.6,945లకు కొనుగోలు చేసినట్లు చెప్పారు. ఏఎంసీ కార్యదర్శి శ్రీనివాసరావు, రైతులు పాల్గొన్నారు.

శంభులింగేశ్వరుడికి అన్నాభిషేకం



నందిగామ: కార్తీకమాస ఆరుద్ర నక్షత్రం నేపథ్యంలో గురువారం ఆయా ఆలయాల్లో ప్రత్యేక పూజలు జరిగాయి. పట్టణంలోని రామలింగేశ్వర స్వామి వారి ఆలయంలో స్వామివారికి పంచామృత అభిషేకాలు నిర్వహించారు. మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన దాములూరు కూడలి సంగమేశ్వరస్వామి వారి ఆలయంలో స్వామివారికి మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం చేశారు. గోళ్లమూడిలోని గంగాపార్వతీ సమేత శంభులింగేశ్వరస్వామి ఆలయంలో స్వామివారికి రుద్రాభిషేకంతోపాటు అన్నాభిషేకం నిర్వహించారు. మండలంలోని ఆయాశివాలయాలలో విశేష పూజలు జరిగాయి. పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొని పూజలు చేశారు.

సామూహిక కుంకుమ పూజలు



నందిగామ: సంకటహర చతుర్ధి నేపథ్యంలో గురువారం పట్టణ శివారు రామలింగేశ్వరనగర్‌లోని లక్ష్మీ గణపతి ఆలయంలో స్వామివారికి విశేష పూజలు నిర్వహించారు. వేకువజామునే స్వామివారికి పంచామృత అభిషేకాలు చేశారు. రాత్రి సమయంలో సామూహిక కుంకుమ పూజలు నిర్వహించగా, పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

జగనన్న పాలనలో ఉద్యోగాల విప్లవం



లింగాలపాడులో మాట్లాడుతున్న నందిగామ ఎమ్మెల్యే డాక్టర్ జగన్‌మోహనరావు



జగ్గయ్యపేటలో డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరిస్తున్న మున్సిపల్ చైర్మన్ రాఘవేంద్ర, నాయకులు



చెన్నారావుపాలెంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ డాక్టర్ అరుణకుమార్

ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

నందిగామ టౌన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి నాలుగున్నరేళ్ల పాలనలో ఉద్యోగ విప్లవం సృష్టించారని నందిగామ ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు పేర్కొన్నారు. మండలంలోని లింగాలపాడులో గురువారం రాత్రి 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా సచివాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన సంక్షేమ పథకాలతో కూడిన డిస్‌ప్లే బోర్డును ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ జగన్‌మోహనరావు మాట్లాడుతూ 2019 వరకు రాష్ట్రంలో 3.95లక్షల మంది ప్రభుత్వ ఉద్యోగులుంటే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన నాలుగున్నరేళ్లలోనే రెండు లక్షలకు పైగా కొత్త ఉద్యోగాలు ఇచ్చారన్నారు. ముఖ్యంగా ఆర్టీసీ ఉద్యోగులను సైతం ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించిన ఘనత జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందని కొనియాడారు. అంతే కాకుండా వలంటీర్లు సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజల ఇళ్ల ముంగిటకే ప్రభుత్వ పాలన తీసుకువచ్చారని గుర్తుచేశారు. గత 30ఏళ్ల టీడీపీ పాలనలో నియోజకవర్గంలోని ఏ గ్రామం కూడా కనీస అభివృద్ధికి నోచుకోలేదన్నారు. గ్రామాల అభివృద్ధికి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పెద్ద ఎత్తున నిధులు మంజూరు చేయడమే కాకుండా గ్రామీణ ప్రాంత ప్రజలకు అవసరమైన అన్ని మౌలిక వసతులను కల్పిస్తున్నట్లు కొనియాడారు. అనంతరం గ్రామంలో ఏర్పాటు చేసిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పతాకాన్ని ఆయన ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంపీపీ అరిగెల సుందరమ్మ, సర్పంచ్ బొల్లినేని పద్మజ, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు పారుపల్లి హరిబాబు, సూరా కృష్ణ, ఎంపీడీవో శ్రీనివాసరావు, నాయకులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.

కంచికచర్లలో..

కంచికచర్ల : టీడీపీ నాయకులు చెప్పే మాయ మాటలకు ప్రజలు మోసపోవద్దని, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేస్తున్న సంక్షేమ పథకాలు అన్ని వర్గాల ప్రజలకు కలుగుతున్న మేలును గమనించాలని ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్ మోహనరావు సూచించారు. కంచికచర్ల గ్రామసచివాలయం-1లో గురువారం రాత్రి 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా ప్రజాప్రతినిధులు, నాయకులు, పార్టీ కార్యకర్తలు ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వం చేసిన మేలును గ్రామస్తులకు వివరించారు. ఆయా ప్రభుత్వ పథకాలు, అభివృద్ధి పనులతో చేకూరిన లబ్ధిని వివరిస్తూ ఏర్పాటు చేసిన డిస్‌ప్లే బోర్డులను ఎమ్మెల్యే ఆవిష్కరించారు. అనంతరం ఎమ్మెల్యే జగన్‌మోహనరావు మాట్లాడుతూ టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు మోసాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. మరోసారి మోసం చేసేందుకు టీడీపీ నాయకులు కల్లబొల్లి మాటలు చెబుతారని, వాటిని నమ్మవద్దని అన్నారు. అర్హతే ప్రామాణికంగా సీఎం జగన్ మోహన్‌రెడ్డి అందరికీ పథకాలను అందిస్తుండటంతోపాటు అవినీతిరహిత పాలన చేస్తున్నారన్నారు. రాష్ట్రాభివృద్ధి కోసం మరోసారి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రి చేయాలని, తనను ఎమ్మెల్యేగా రెండోసారి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచి వేల్పుల సునీత, ఎంపీటీసీ సభ్యులు మాడుగుల మధుబాబు వైఎస్సార్‌సీపీ మండల, పట్టణ కన్వీనర్లు నన్నపనేని నరసింహారావు, వేమా సురేష్‌బాబు, సొసైటీ అధ్యక్షుడు కాలవ పెదబాబు, నాయకులు వేల్పుల శ్రీనివాసరావు, దేవరకొండ గురవయ్య, నారిశెట్టి శ్రీనివాసరావు, ఎం పాండు రంగారావు, మండల పరిషత్ సూపరింటెండెంట్ బాలశంకరరావు, పంచాయతీ కార్యదర్శి మీర్జావలి పాల్గొన్నారు.

తిరుమలగిరిలో..

తిరుమలగిరి (జగ్గయ్యపేట): మండలంలోని చిల్లకల్లు రెండో సచివాలయం పరిధిలోని తిరుమలగిరి గ్రామంలో గురువారం 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమం నిర్వహించారు. ఆయా పథకాల లబ్ధి వివరాలతో కూడిన డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరించారు. ఈసందర్భంగా వైఎస్సార్ సీపీ మండల పార్టీ కన్వీనర్ మండల శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ గతంలో ఎన్నడూలేని విధంగా రాష్ట్రంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన నాలుగున్నరేళ్ల పాలనలో పేదల సంక్షేమానికి విశేషంగా కృషిచేశారన్నారు. సచివాలయ వ్యవస్థ ద్వారా పాలనను ప్రజల ముంగిటకే తెచ్చిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని కొనియాడారు. గ్రామ పార్టీ కన్వీనర్ కరిసే ఇజ్రాయిల్, గ్రామ పార్టీ నాయకులు తాటి రామారావు, జాగు జనార్దన్, పోతురాజు వసంతరావు, లింగగిరి రాంబాబు, చింతల నరసింహారావు, వేముల కుమార్, గుడారు బుర్రస్వామి, మెట్టు ఏడుకొండలు పాల్గొన్నారు.

ముండ్లపాడులో..

ముండ్లపాడు(పెనుగంచిప్రోలు): ప్రజా సంక్షేమమే ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు కనకపూడి భాస్కరరావు తెలిపారు. ముండ్లపాడు సచివాలయ పరిధిలో 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమాన్ని నిర్వహించారు. సంక్షేమ పథకాల లబ్ధి వివరాలతో ఏర్పాటు చేసిన డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరించారు. ఈసందర్భంగా భాస్కరరావు మాట్లాడుతూ చెప్పింది చేసే సత్తా ఒక్క జగనన్నకే ఉందని పేర్కొన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ గుంటుపల్లి వాసు, పూసల కార్పొరేషన్ డైరక్టర్ చేని కుమారి, సొసైటీ అధ్యక్షుడు గూడపాటి రవికుమార్, వైఎస్సార్‌సీపీ గ్రామాధ్యక్షుడు కూచి విష్ణు, మండల బీసీ సెల్ నాయకులు బత్తుల శ్రీనివాసరావు, నాయకులు చింతా నాగేశ్వరరావు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

కంభంపాడులో..

వత్సవాయి(పెనుగంచిప్రోలు): మండలంలోని కంభంపాడులో గురువారం'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమాన్ని నిర్వహించారు. సచివాలయ పరిధిలో లబ్ధిదారులకు అందించిన సంక్షేమ పథకాల వివరాలతో కూడిన డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరించారు. కార్యక్రమంలో సర్పంచ్ ఎం.పున్నమ్మ, ఎంపీపీ రమాదేవి, సొసైటీ అధ్యక్షుడు వేమిరెడ్డి వెంకటనారాయణరెడ్డి, ఎంపీటీసీ సభ్యులు గంగుల శివకల్యాణి, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు గుత్తా శంకరరావు, మధుసూదనరెడ్డి, నాగేశ్వరరెడ్డి, నరాల వెంకటరెడ్డి పాల్గొన్నారు.

జగ్గయ్యపేట పట్టణంలో..

జగ్గయ్యపేట అర్బన్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు నిరంతరాయంగా అందాలంటే ముఖ్యమంత్రిగా మళ్లీ జగనన్ననే చేసుకుందామని మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర పిలుపునిచ్చారు. పట్టణంలోని 9వ సచివాలయం పరిధి పాతపేటగడ్డ వద్ద గురువారం రాత్రి 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమాన్ని నిర్వహించారు. 19, 21వ వార్డులకు సంబంధించి ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి వివరాలతో కూడిన డిస్‌ప్లే బోర్డును మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, పట్టణ సచివాలయాల కన్వీనర్ తుమ్మేపల్లి నరేంద్ర, పార్టీ జిల్లా చేనేత విభాగం అధ్యక్షుడు పెంటి శ్రీనివాసరావు ఆవిష్కరించారు. అలాగే సచివాలయం వద్ద కూడలిలో వైఎస్సార్ సీపీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఏర్పాటుచేసి సభలో చైర్మన్ రాఘవేంద్ర మాట్లాడుతూ దేశంలోనే కుల మతాలకతీతంగా అర్హతే ప్రామాణికంగా అందరికీ సంక్షేమ పథకాలను అందిస్తున్న ఏకైక ప్రభుత్వం సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వమన్నారు. రాష్ట్రచరిత్రలో ఎన్నడూ లేనివిధంగా వలంటీర్లు, సచివాలయ వ్యవస్థ ద్వారా సంక్షేమ పథకాలను, పరిపాలనను ప్రజల ముంగిటకే తీసుకువచ్చి గాంధీజీ కలలు కన్న గ్రామస్వరాజ్యాన్ని స్థాపించారని కొనియాడారు. పట్టణ సచివాలయాల కన్వీనర్ తుమ్మేపల్లి నరేంద్ర మాట్లాడుతూ చేసిన అభివృద్ధిని, మేలును బోర్డుపై రాసి మరీ ఓట్లు అడిగే దమ్మున్న ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని పేర్కొన్నారు. పార్టీ జిల్లా చేనేత విభాగం అధ్యక్షుడు పెంటి శ్రీనివాసరావు మాట్లాడుతూ 9వ సచివాలయం పరిధిలో ప్రజలకు సంక్షేమ పథకాల ద్వారా రూ.9 కోట్లకు పైగా లబ్ధి చేకూరిందని తెలిపారు. వైఎస్సార్ సీపీ ఎస్టీ విభాగం అధ్యక్షుడు బద్దూనాయక్, పెద్ద శివాలయం చైర్మన్ గెల్లా పూర్ణచంద్రరావు, చందా రామచంద్రరావు,అలానపురి వెంకటేశ్వరరావు, పెద్దాపురపు సుధీర్, కొంకిమళ్ల మురళి, సచివాలయ కన్వీనర్ లాలూ, కార్యకర్తలు పాల్గొన్నారు.



కంచికచర్లలో డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరించిన ఎమ్మెల్యే జగన్‌మోహనరావు, నాయకులు



జగ్గయ్యపేట మండలం తిరుమలగిరిలో ..



పెనుగంచిప్రోలు మండలం ముండ్లపాడులో ..

ఏనుగుగడ్డ వాగుపై బ్రిడ్జికి త్వరలో శంకుస్థాపన

ఎమ్మెల్సీ అరుణకుమార్

చెన్నారావుపాలెం(వీరులపాడు): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సహకారంతో త్వరలోనే నందిగామ ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్ మోహనరావు ఏనుగుగడ్డ వాగుపై బ్రిడ్జి నిర్మాణానికి శంకుస్థాపన చేస్తారని ఎమ్మెల్సీ డాక్టర్ మొండితోక అరుణకుమార్ తెలిపారు. మండలంలోని చెన్నారావుపాలెం గ్రామ సచివాలయంలో గురువారం రాత్రి 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమన్ని నిర్వహించారు. సంక్షేమ పథకాల వివరాలతో రూపొందించిన డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఎమ్మెల్సీ డాక్టర్ అరుణకుమార్ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలనే కాకుండా అగ్రవర్ణ పేదలకు సైతం సంక్షేమ పథకాలు అందించి ఆదుకున్న ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డి చరిత్ర సృష్టించారని కొనియాడారు. గ్రామంలో సచివాలయ భవనం, రైతుభరోసా కేంద్రం నిర్మాణానికి స్థలం అందుబాటులో లేదని గ్రామస్తులు తెలుపగా, సొంత ఖర్చులతో 10 సెంట్ల స్థలాన్ని ఎమ్మెల్యే జగన్‌మోహనరావు, తాను కొనుగోలు చేసి ఇస్తామని హామీ ఇచ్చారు. పేదల అభ్యున్నతికి కృషిచేస్తామని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ఆవుల రమేష్‌బాబు, సర్పంచ్ పత్తిపాటి మల్లికార్జునరావు, జడ్పీటీసీ సభ్యురాలు అమర్లపూడి కీర్తి సౌజన్య, జడ్పీటీసీ మాజీ సభ్యుడు కోటేరు ముత్తారెడ్డి, ఎంపీడీవో అరుంధతీదేవి, నాయకులు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

బీసీ, ఎస్సీల్లో పెరిగిన ఆత్మగౌరవం

నందిగామ టౌన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పాలనలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు ఆత్మగౌరవంతో సంతోషంగా జీవిస్తున్నారని నందిగామ ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు పేర్కొన్నారు. పట్టణంలోని 19వవార్డు పరిధిలోని అనాసాగరంలో గురువారం గడపగడపకు మనప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. వార్డులోని ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి ఆయా పథకాల అమలు తేదీలతో కూడిన క్యాలెండర్‌ను అందజేశారు. ఎమ్మెల్యే జగన్‌మోహనరావుకు మహిళలు ఆత్మీయ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జగన్‌మోహనరావు మాట్లాడుతూ గత ప్రభుత్వాలు బడుగు, బలహీన వర్గాల సంక్షేమం, అభివృద్ధిని గాలికొదిలేయగా, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాత్రం ఆ వర్గాల అభ్యున్నతే లక్ష్యంగా పాలన సాగిస్తున్నారన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు మంత్రి, ఉప ముఖ్యమంత్రి పదవులతోపాటు నామినేటెడ్ పదవులలో సైతం సింహభాగం కేటాయించిన ఏకైక ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అని కొనియాడారు. విద్యారంగ అభివృద్ధికి నాడు-నేడు పథకం ద్వారా కోట్లాది రూపాయలు కేటాయించి పాఠశాలలను కార్పొరేట్ స్థాయిలో తీర్చిదిద్దారన్నారు. ప్రజలకు మంచి చేయడమే జగన్‌మోహన్‌రెడ్డి ఆశయమని, అందుకనుగుణంగా అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ప్రజలకు చేయగలిగినంత మంచి చేస్తున్నారని చెప్పారు. ప్రజల కష్టసుఖాలు తెలిసిన ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డికి మద్దతు పలికి అఖండ విజయాన్ని అందించాలని కోరారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ మందా మరియమ్మ, మున్సిపల్ వైస్ చైర్మన్ పాకాలపాటి కిరణ్, ఏఎంసీ చైర్మన్ మహ్మద్‌మస్తాన్, పార్టీ పట్టణ కన్వీనర్ దొంతిరెడ్డి దేవేందర్‌రెడ్డి, నాయకులు కరి రవీంద్ర, పాములపాటి రమేష్, మెల్లంపూడి లక్ష్మి, షేక్ జాఫర్, చాపల మల్లికార్జునరావు, మున్సిపల్ కమిషనర్ జయరాం, ఏఈ ఫణి శ్రీనివాస్, నాయకులు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.



అనాసాగరంలో సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

సాధికార యాత్ర పోస్టర్ ఆవిష్కరణ

కంచికచర్ల : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సామాజిక సాధికార బస్సు యాత్రను విజయవంతం చేయాలని ఎమ్మెల్సీ డాక్టర్ మొండితోక అరుణకుమార్ పిలుపునిచ్చారు. కంచికచర్ల వ్యవసాయ మార్కెట్‌యార్డులో ప్రజాప్రతినిధులు, పార్టీ ముఖ్య నాయకులతో గురువారం ఆయన సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్సీ అరుణకుమార్ మాట్లాడుతూ నందిగామలో డిసెంబర్ ఐదున జరిగే సామాజిక సాధికార బస్సు యాత్రకు ప్రతి ఇంటి నుంచి ప్రజలు వచ్చి దిగ్విజయం చేయాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల, పట్టణ కన్వీనర్లు నన్నపనేని నరసింహారావు, వేమా సురేష్‌బాబు, జడ్పీటీసీ సభ్యులు వేల్పుల ప్రశాంతి, సర్పంచి వేల్పుల సునీత, ఎంపీటీసీ సభ్యులు మాడుగుల మధు బాబు, మాజీ ఎంపీపీ పాటిబండ్ల హరిజగన్నాథరావు, మండల గ్రామ సచివాలయ కన్వీనర్ చింతా రవీంద్రనాథ్, నాయకులు కాలవ పెదబాబు, వేల్పుల శ్రీనివాసరావు, రాయల నరసింహారావు, బుడ్డి సత్యనారాయణ, పరిటాల రాము, బండారుపల్లి సత్యనారాయణ పాల్గొన్నారు.

పెద్దాపురంలో..

పెద్దాపురం(వీరులపాడు): ఈనెల ఐదోతేదీన నందిగామలో జరుగనున్న సామాజిక సాధికార బస్సు యాత్రను వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు విజయవంతం చేయాలని ఎమ్మెల్సీ డాక్టర్ మొండితోక అరుణకుమార్ కోరారు. మండలంలోని పెద్దాపురంలో బస్సు యాత్రకు సంబంధించి మండలంలోని పార్టీ నాయకులతో గురువారం రాత్రి ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా అరుణకుమార్ మాట్లాడుతూ కంచికచర్ల మండలం కీసర నుంచి నందిగామలోని గాంధీసెంటర్ వరకు బస్సు యాత్ర జరుగుతుందని, అనంతరం బహిరంగసభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వీరులపాడు, కంచికచర్ల మండలాల నాయకులు, కార్యకర్తలు కీసర వద్ద బస్సు యాత్రకు ఘనస్వాగతం పలికి భారీర్యాలీగా నందిగామకు వెళ్లేలా ప్రణాళిక రూపొందించామన్నారు. గ్రామాల్లోని ప్రతి ఇంటికీ వెళ్లి ఆహ్వాన పత్రిక అందించి బస్సు యాత్రలో పాల్గొనాలని ప్రజలను ఆహ్వానించాలని సూచించారు. సమావేశంలో పార్టీ మండల కన్వీనర్ ఆవుల రమేష్‌బాబు, ఎంపీపీ కోటేరు లక్ష్మి, జడ్పీటీసీ సభ్యురాలు అమర్లపూడి కీర్తి సౌజన్య, ఏఎంసీ మాజీ చైర్మన్ బొమ్మిశెట్టి భాస్కరరావు, జడ్పీటీసీ మాజీ సభ్యుడు కోటేరు ముత్తారెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ నువ్వుల విశ్వనాథం తదితరులు పాల్గొన్నారు.



సాధికార యాత్ర పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ అరుణకుమార్, నాయకులు

4న బహిరంగ వేలం

కంచికచర్ల : ఇటీవల అక్రమంగా తరలిస్తుండగా స్వాధీనం చేసుకున్న 58 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని ఈనెల 4వ తేదీన తహశీల్దార్ కార్యాలయంలో బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు తహశీల్దార్ పబ్బూరి శంకరబాబు గురువారం తెలిపారు. వ్యాట్ లైసెన్స్ కలిగిన వారు ఈ వేలంలో పాల్గొనవచ్చని వివరించారు. అక్రమంగా రేషన్ బియ్యాన్ని తరలించే వారిపై కఠినచర్యలు తీసుకుంటామని తహశీల్దార్ హెచ్చరించారు.

సౌత్‌జోన్ పోటీలకు 'మిక్' విద్యార్థి ఎంపిక



కంచికచర్ల: స్థానిక మిక్ ఇంజినీరింగ్ కళాశాల బీటెక్ సెకండియర్ విద్యార్థి ఎం.శ్యామ్యూల్ ఈనెల 24 నుంచి 26వ తేదీ వరకు జేఎన్‌టీయూ కాకినాడ ఆధ్వర్యంలో జరిగిన వాలీబాల్ పోటీల్లో విశేష ప్రతిభను కనబరిచాడని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి.వంశీకిరణ్ తెలిపారు. త్వరలో కర్ణాటకలో జరిగే సౌత్ జోన్ ఇంటర్ యూనివర్సిటీ వాలీబాల్ టోర్నమెంట్‌కు ఎంపికయ్యాడని వివరించారు. విద్యార్థులను చదువుతోపాటు క్రీడల్లోనూ ప్రోత్సహిస్తున్నట్లు చెప్పారు. ఈసందర్భంగా విద్యార్థి శామ్యూల్‌ను కళాశాల సీఈవో డి.పాండురంగారావు, డైరెక్టర్ ఎం.సుహాస్, ఫిజికల్ డైరెక్టర్ నిమ్మగడ్డ శౌరయ్య తదితరులు అభినందించారు.

విద్యార్థులకు అర్థమయ్యేలా బోధించాలి

పెనుగంచిప్రోలు: భాషలో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారికి అర్థమయ్యే రీతిలో ఉపాధ్యాయులు బోధన చేయాలని ఎంఈవో డి.రవీంద్ర సూచించారు. స్థానిక కేవీఆర్ జెడ్పీ హైస్కూల్‌లో పెనుగంచిప్రోలు, జగ్గయ్యపేట, వత్సవాయి మండలాలకు చెందిన తెలుగు భాష బోధించే ఉపాధ్యాయులకు గురువారం స్కూల్ కాంప్లెక్స్ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా తెలుగు భాషా వికాసానికి చేపట్టాల్సిన చర్యలు, పాఠ్య పుస్తకాల్లో ఉన్న పాఠ్యాంశాలపై చర్చించారు. అనంతరం గురజాడ అప్పారావు 108వ వర్ధంతిని పురస్కరించుకుని ఆయన చిత్ర పటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ చైర్మన్ పి.సునీల్‌కుమార్, ఆర్పీలు దోనపాటి నాగేశ్వరరావు, దైదా దానయ్య, ఉపాధ్యాయులు ప్రభుదాసు, రాములు, సౌందర్య తదితరులు పాల్గొన్నారు.



గురజాడ అప్పారావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎంఈవో, ఉపాధ్యాయులు

విగ్రహాల ఏర్పాటు సముచితమే

అఖిలపక్ష నాయకులు

నందిగామ టౌన్: గాంధీ సెంటర్‌లో జాతీయ, రాష్ట్రస్థాయి నాయకుల విగ్రహాలను ఏర్పాటు చేయడం సముచితమేనని అఖిలపక్ష నాయకులు పేర్కొన్నారు. గాంధీ సెంటర్‌లో ఏర్పాటు చేసిన విగ్రహాలకు సంబంధించి స్థానిక మున్సిపల్ కార్యాలయంలో గురువారం అఖిలపక్ష నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అఖిలపక్ష నాయకులు మాట్లాడుతూ గాంధీసెంటర్‌లో ఓ క్రమపద్ధతిలో ఏర్పాటు చేసిన జాతీయ, రాష్ట్రస్థాయి నాయకుల విగ్రహాలను తొలగించాలని టీడీపీ నేతలు కోర్టును ఆశ్రయించడం బాధాకరమన్నారు. కోర్టు ఆదేశాల మేరకు విగ్రహాలు తొలగించాలని కలెక్టర్ ఆదేశించిన నేపథ్యంలో, కలెక్టర్‌ని కలిసి సమయం ఇవ్వాలని కోరాలని నిర్ణయించారు. కోర్టును కూడా ఆశ్రయించి విగ్రహాలు తొలగించవద్దని కోరుతామని అఖిలపక్ష నాయకులు తెలిపారు. ఈ సమావేశంలో అఖిలపక్ష నాయకులు మహ్మద్ మస్తాన్, దొంతిరెడ్డి దేవేందర్‌రెడ్డి, బండారు కేదార్‌నాథ్, కామా శ్రీనివాసరావు, బచ్చలకూర పుష్పరాజ్, షేక్ కరిముల్లా, పలు పార్టీల నాయకులు పాల్గొన్నారు. ఈ అఖిలపక్ష సమావేశానికి టీడీపీ నాయకులు గైర్హాజరుకాగా, విగ్రహాల ఏర్పాటులో నిబంధనలు పాటించలేదని పేర్కొంటూ జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి తంబళ్లపల్లి రమాదేవి ఈ సమావేశం నుంచి వెళ్లిపోయారు.

శివాలయంలో శాంతి కల్యాణం

మైలవరం: స్థానిక శ్రీభ్రమరాంబ మల్లేశ్వరస్వామి దేవస్థానంలో కార్తిక మాసం సందర్భంగా గురువారం శాంతి కల్యాణం ఘనంగా జరిగింది. ద్వారకా తిరుమల దేవస్థానాల చైర్మన్ ఎస్వీ సుధాకరరావు ఆధ్వర్యాన జరిగిన శాంతి కల్యాణ మహోత్సవంలో విశేష సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ద్వారకా తిరుమల దేవస్థానానికి చెందిన 30మంది శ్రీవారి సేవకులతో దేవస్థానం వంశ పారంపర్య ధర్మకర్త ఎస్వీ నివృతరావు ప్రారంభించారు.

వైభవంగా కార్తీక దీపోత్సవం



జగ్గయ్యపేట: కార్తీకమాసం సందర్భంగా పట్టణంలోని బ్రాహ్మణ బజార్లో వేంచేసియున్న అన్నపూర్ణ కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో గురువారం రాత్రి కోటి దీపోత్సవ కార్యక్రమాన్ని వైభవోపేతంగా నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో భక్తులు 365దీపాలతో కార్తీక దీపాలు వెలిగించి ప్రత్యేక పూజలు చేశారు. కోటి వత్తులతో తయారుచేసిన దీపాన్ని వెలిగించారు. యామిని అనే భక్తురాలు ముగ్గుతో వేసిన శివుని ప్రతిమ ప్రత్యేకాకర్షణగా నిలిచి అందరినీ ఆకట్టుకుంది.